[illegible]
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి–221

Telugu

[PRICE : Rs. 5.00
మూల్యము: రూ. 5.00

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారముతో ప్రచురించబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | मंगलवार | ९ मार्च, १९९३ | १ फालगुन, १९१४ शक | खण्ड ८ |
| No. 1 | New Delhi | Tuesday | 9th March, 1993 | 1st Phalgun, 1914 Saka | Vol. 8 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | మంగళవారము | 9 మార్చి, 1993 | 1 ఫాల్గుణ, 1914 శక | సంపుటము 8 |

## MINISTRY OF LAW AND JUSTICE

## LEGISLATIVE DEPARTMENT

New Delhi, 4th February, 1993/12th Magha 1914 Saka

The translations in Telugu of the following, namely :-

(1) The Payment of Gratuity Act, 1972 (39 of 1972)
(2) The Prisoners Act, 1900 (3 of 1900)
(3) The Indian Treasure Trove Act, 1878 (6 of 1878); and
(4) The Land Acquisition Act, 1894 (1 of 1894) are hereby published under the authority the President and shall be deemed to be the authoritative texts thereof in Telugu under clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

న్యూఢిల్లీ, 4 ఫిబ్రవరి, 1993/12 మాఘ, 1914 శక

ఈ క్రింది చట్టములు అనగా :--

(1) ది పేమెంట్ ఆఫ్ గ్రాట్యూటీ యాక్టు, 1972 (1972 లోని 39వ చట్టము)

(2) ది ప్రిజనర్స్ యాక్టు, 1900 (1900 లోని 3వ చట్టము)

(3) ది ఇండియన్ ట్రెజర్ ట్రోవ్ యాక్టు, 1878 (1878 లోని 6వ చట్టము) మరియు

(4) ది ల్యాండ్ ఎక్విజిషన్ యాక్టు, 1894 (1894 లోని 1వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములు రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములు ఆ చట్టములకు ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# గ్రాట్యుటీ చెల్లింపు చట్టము, 1972

(1972 లోని 39వ చట్టము)

(21 ఆగస్టు, 1972)

ఫ్యాక్టరీలు, గనులు, తైలక్షేత్రములు, తోటలు, ఓడరేవులు, రైల్వే కంపెనీలు, దుకాణాలు, లేక ఇతర స్థాపనలలో పనిచేయుచున్న ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించు పథకం కొరకును, దానికి సంబంధించిన లేక అనుషంగికమైన విషయముల కొరకును నిబంధనలు చేయుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క ఇరువది మూడవ సంవత్సరంలో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయడమైనది.

1. (1) ఈ చట్టమును గ్రాట్యుటీ చెల్లింపు చట్టము, 1972 అని పేర్కొన వచ్చును. సంగ్రహనామము, విస్తరణ, వర్తింపు మరియు ప్రారంభము.

(2) ఇది యావద్భారత దేశమునకు విస్తరించును:

అయితే, తోటలకు, లేక ఓడరేవులకు సంబంధించినంతవరకు ఇది జమ్మూ కాశ్మీరు రాజ్యమునకు విస్తరించదు.

(3) ఇది ఈ క్రింది వాటికి వర్తించును.

(ఎ) ప్రతియొక ఫ్యాక్టరీ, గని, తైలక్షేత్రము, తోట, ఓడరేవు, మరియు రైల్వే కంపెనీ;

(బి) ఏదేని రాజ్యములో దుకాణాలు మరియు స్థాపనల విషయమున తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము యొక్క భావపరిధిలో దుకాణము లేక స్థాపన అయియుండి, పది, లేక అంతకెక్కువమంది వ్యక్తులు నియమించబడియున్న, లేక పూర్వపు పండ్రెండు మాసములలో ఏ దినముననైనను నియమించబడియుండిన ప్రతియొక దుకాణము లేక స్థాపన;

(సి) ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి, అందు పది లేక అంతకెక్కువ మంది ఉద్యోగులు నియమించబడియున్న, లేక పూర్వపు పండ్రెండు మాసములలో ఏ దినముననైనను నియమించబడియుండిన ఇతర స్థాపనలు లేక ఇతర కోవలకు చెందిన స్థాపనలు;

(3-ఏ) ఏదేని దుకాణానికి గాని స్థాపనకుగాని ఈ చట్టము వర్తించునదై అందు నియుక్తులైన వ్యక్తుల సంఖ్య పదికంటె తక్కువైనప్పటికిని, అట్టి దుకాణానికి లేక స్థాపనకు ఈ చట్టము వర్తించుట కొనసాగును.

(4) ఇది, కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియతం చేయునట్టి తేదీన అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థం వేరుగా ఉన్ననే తప్ప– నిర్వచనములు.

(ఎ) "సముచిత ప్రభుత్వము" అనగా,–

(i) (ఎ) కేంద్ర ప్రభుత్వమునకు చెందిన, లేక కేంద్ర ప్రభుత్వము నియంత్రణలోనున్న;

(బి) ఒకటి కంటె ఎక్కువ రాజ్యాలలో శాఖలు కలిగియున్న;

(సి) కేంద్ర ప్రభుత్వమునకు చెందిన, లేక కేంద్ర ప్రభుత్వము నియంత్రణలోనున్న ఒక ఫ్యాక్టరీయొక్క;

(డి) ఒక పెద్ద ఓడరేవు, గని, తైలక్షేత్రము, లేక రైల్వే కంపెనీ యొక్క

స్థాపనల విషయంలో కేంద్ర ప్రభుత్వము అనియు

(ii) ఏదేని ఇతర విషయంలో రాజ్యప్రభుత్వము అనియు అర్థము.

(బి) "పూర్తియైన సేవా సంవత్సరం" అనగా ఒక సంవత్సరం నిరంతరం చేసిన సేవ అని అర్థము;

(సి) "నిరంతర సేవ" అనగా 2-ఏ పరిచ్ఛేదములో నిర్వచించినట్లుగా నిరంతర సేవ అని అర్థము;

(డి) "నియంత్రణ ప్రాధికారి" అనగా సముచిత ప్రభుత్వము 3వ పరిచ్ఛేదము క్రింద నియమించిన ప్రాధికారి అని అర్థము;

(ఇ) "ఉద్యోగి" అనగా ఏదేని స్థాపనలో, ఫ్యాక్టరీలో, గనిలో, తైల క్షేత్రములో, తోటలో, ఓడరేవులో, రైల్వే కంపెనీలో లేక దుకాణములో ఏదేని నిపుణత గల, అర్ధ నిపుణతగల లేక నిపుణతలేని, కాయకష్టముతో కూడిన, పర్యవేక్షక, సాంకేతిక పని లేక గుమాస్తా పని చేయుటకు నెలకు రెండువేల అయిదువందల రూపాయలకు లేక వేతనాల సాధారణ స్థాయిని దృష్టియందుంచుకొని కేంద్ర ప్రభుత్వం అధిసూచన ద్వారా నిర్దిష్టపరచునట్టి అంతకంటె ఎక్కువ మొత్తమునకు మించని వేతనంపై నియుక్తుడైన, ఉద్యోగ నిబంధనలు అభివ్యక్తమైనవైనను, గర్భితమైన వైనను, అట్టి వ్యక్తి మేనేజిరియల్ హోదాలో నియమించబడినను, పరిపాలక హోదాలో నియమించబడినను - (శిక్షణార్థి కానట్టి) ఎవరేని వ్యక్తి అని అర్థము; కాని ఈ పదపరిధియందు, కేంద్ర ప్రభుత్వము క్రింద గాని రాజ్య ప్రభుత్వము క్రిందగాని ఏదేని పదవిని కలిగియుండి గ్రాట్యుటీ చెల్లింపుకై నిబంధనగల ఏదేని ఇతర చట్టము లేక ఏవేని నియమములు వర్తించు వ్యక్తి చేరియుండడు;

<u>విశదీకరణ</u>:- ఖండము (ఇ) ద్వారా లేక దాని క్రింద తత్సమయమున నిర్దిష్ట పరచిన మొత్తమునకు మించని వేతనంపై అయిదు సంవత్సరములకు తక్కువకాని కాలావధిపాటు నియమించబడి, అటు పిమ్మట ఎప్పుడైనను అట్టి మొత్తమునకు మించిన వేతనముపై నియమింపబడియున్న ఉద్యోగి విషయంలో, ఆ ఉద్యోగి అట్టి మొత్తము నకు మించని వేతనముపై నియమించబడియుండిన కాలావధికి గ్రాట్యుటీని అతడు ఆ కాలావధిలో పొందిన వేతనపు ప్రాతిపదికపై నిర్ధారణ చేయవలెను;

(ఎఫ్) ఏదేని స్థాపన ఫ్యాక్టరీ, గని, తైలక్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ, లేక దుకాణము విషయంలో "నియామకుడు" అనగా---

(i) అది కేంద్ర ప్రభుత్వమునకు, లేక ఒక రాజ్య ప్రభుత్వమునకు చెందినది, లేక కేంద్ర ప్రభుత్వము యొక్క, లేక ఒక రాజ్య ప్రభుత్వము యొక్క నియంత్రణ క్రింద ఉన్నది అయినచో, సముచిత ప్రభుత్వము ఉద్యోగుల అధీక్షణ మరియు నియంత్రణల కొరకు నియమించిన వ్యక్తి, లేక ప్రాధికారి అని, లేక ఏ వ్యక్తిగాని ప్రాధికారిగాని అట్లు నియమింపబడనియెడల, సంబంధిత మంత్రిత్వశాఖ యొక్క లేక విభాగము యొక్క ప్రధానాధికారి అని అర్థము;

(ii) అది ఒక స్థానిక ప్రాధికార సంస్థకు చెందినది లేక స్థానిక ప్రాధికార సంస్థయొక్క నియంత్రణ క్రింద ఉన్నదైనచో, ఉద్యోగుల అధీక్షణ, మరియు నియంత్రణకై అట్టి ప్రాధికార సంస్థ నియమించిన వ్యక్తి అని, లేక ఏ వ్యక్తిగాని అట్లు నియమించబడనియెడల, ఆ స్థానిక ప్రాధికార సంస్థ యొక్క ముఖ్య కార్యనిర్వహణాధికారి అని అర్థము;

(iii) ఏదేని ఇతర సందర్భములో ఆ స్థాపన, ఫ్యాక్టరీ, గని, తైల క్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ, లేక దుకాణము యొక్క కార్యకలాపము పైన అంతిమ నియంత్రణ కలిగియున్న వ్యక్తి, లేక ప్రాధికారి అని, మేనేజరు లేక మేనేజింగు డైరెక్టరు అనబడినను, లేక ఏదేని ఇతర పేరుతో పిలువబడినను ఎవరేని ఇతర వ్యక్తికి సదరు కార్యకలాపములు అప్పగించబడినయెడల అట్టి వ్యక్తి అని అర్థము;

(జి) "ఫ్యాక్టరీ" అను పదము, ఫ్యాక్టరీల చట్టము, 1948 యొక్క 2వ పరిచ్ఛేదపు, ఖండము (ఎం)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును. 1948 లోని 63.

(హెచ్) ఒక ఉద్యోగి విషయంలో "కుటుంబము" ఈ క్రింది వారితో కూడి యున్నట్లు భావించవలెను:-

(i) పురుష ఉద్యోగి విషయంలో, అతడు, అతని భార్య, వివాహితులైనను కాకున్నను అతని పిల్లలు, ఆశ్రితులైన అతని తల్లిదండ్రులు మరియు అతని భార్య యొక్క ఆశ్రితులైన తల్లిదండ్రులు మరియు అతని పూర్వ మృతపుత్రుని వితంతువు మరియు పిల్లలు ఎవరేని ఉన్నచో, వారు,

(ii) స్త్రీ ఉద్యోగి విషయంలో ఆమె, ఆమె భర్త, వివాహితులైనను కాకున్నను ఆమె పిల్లలు, ఆశ్రితులైన ఆమె తల్లిదండ్రులు, మరియు ఆమె భర్త యొక్క ఆశ్రితులైన తల్లిదండ్రులు, మరియు ఆమె పూర్వమృత పుత్రుని వితంతువు మరియు పిల్లలు ఎవరేని ఉన్నచో, వారు;

<u>విశదీకరణ</u>.- ఒక ఉద్యోగి యొక్క వైయక్తిక శాసనము అట్టి ఉద్యోగి ఒక బిడ్డను దత్తు తీసికొనుటకు అనుమతించునెడల, అతనిచే శాసనసమ్మతముగా దత్తు తీసికొనబడిన ఎవరేని బిడ్డను, అతని కుటుంబములో చేరియున్నట్లు భావించవలెను, మరియు ఒక ఉద్యోగి యొక్క బిడ్డ మరొక వ్యక్తిచే దత్తు తీసికొనబడినయెడల మరియు అట్టి దత్తు, అట్లు దత్తు తీసికొనిన వ్యక్తియొక్క వైయక్తిక శాసనము ననుసరించి శాసనసమ్మతమైనదైనయెడల, ఆ బిడ్డను అట్టి ఉద్యోగి కుటుంబము నుండి మినహాయించినట్లు భావించవలెను.

(ఐ) "పెద్ద ఓడరేవు" అను పదబంధము, భారతీయ ఓడరేవుల చట్టము, 1908 యొక్క 3వ పరిచ్ఛేదపు, ఖండము (8)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును; 1908 లోని 15.

1952 లోని 35. (జె) "గని" అను పదము గనుల చట్టము, 1952 యొక్క 2వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) లోని ఖండము (జె)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును;

(కె) "అధిసూచన" అనగా రాజపత్రములో ప్రచురించిన అధిసూచన అని అర్థము;

1948 లోని 53. (ఎల్) "తైలక్షేత్రము" అను పదబంధము తైలక్షేత్రముల (క్రమబద్ధీకరణ మరియు అభివృద్ధి) చట్టము, 1948 యొక్క 3వ పరిచ్ఛేదపు ఖండము (ఈ)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును;

1951 లోని 69. (ఎమ్) "తోట" అను పదము తోట శ్రామికుల చట్టము, 1951 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎఫ్)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును;

1908 లోని 15. (ఎన్) "ఓడరేవు" అను పదబంధము భారతీయ ఓడరేవుల చట్టము, 1908 యొక్క 3వ పరిచ్ఛేదపు ఖండము (4)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును;

(ఓ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమావళి ద్వారా విహితపరచిన అని అర్థము;

1890 లోని 9. (పి) "రైల్వే కంపెనీ" అను పదబంధము భారతీయ రైల్వే చట్టము, 1890 యొక్క 3వ పరిచ్ఛేదపు ఖండము (5)లో దానికి ఏ అర్థము ఒసగబడినదో ఆ అర్థమునే కలిగియుండును;

(క్యూ) "పదవీ విరమణ" అనగా వయసు నిండిన మీదట గాక అన్యథా ఒక ఉద్యోగి యొక్క సేవ సమాప్తమగుట అని అర్థము;

(ఆర్) ఒక ఉద్యోగి విషయంలో "వయసు నిండుట" అనగా ఆ ఉద్యోగికి ఇంత వయసు వచ్చినపుడు ఆ ఉద్యోగమును వదిలి వేయవలెనని సేవా కాంట్రాక్టులో గాని, సేవా షరతులలోగాని నియతము చేయబడునో అట్టి వయసు ఆ ఉద్యోగికి వచ్చుట అని అర్థము;

(ఎస్) "వేతనము" అనగా డ్యూటీలో ఉన్నపుడుగాని సెలవులో ఉన్నపుడు గాని ఒక ఉద్యోగి, అతని ఉద్యోగ నిబంధనలను మరియు షరతుల ననుసరించి, సంపాదించినవై అతనికి నగదు రూపమున చెల్లించిన, లేక చెల్లించదగిన అన్ని ఉపలబ్ధులు అని అర్థము; మరియు ఇందు, కరువు బత్యెము చేరియుండును, కాని ఏదేని బోనసు, కమీషను, ఇంటి అద్దె బత్యెము, అదనపు కాల వేతనము మరియు ఏదేని ఇతర బత్యెము చేరియుండదు.

నిరంతర సేవ. 2–ఏ. ఈ చట్ట ప్రయోజనముల కొరకు—

(1) ఎవరేని ఉద్యోగి ఏదేని కాలావధిలో అనారోగ్యము, దుర్ఘటన, సెలవు, సెలవు లేకుండ ఉద్యోగం నుండి గైరు హాజరు కారణంగా (స్థాపనలో ఉద్యోగులకు వర్తించు స్థాయీ ఉత్తరువులు, నియమములు లేక వినియమముల ననుసరించి సేవలో *అంతరాయంగా పరిగణించు ఉత్తరువు చేయబడిన గైరుహాజరు కానట్టిది), పని బందు, సమ్మె లేక తాలా బందు లేక ఉద్యోగి తప్పిదమేదియు లేకుండ పని

*బ్రేకుగా

నిలిపివేసిన కారణంగా అంతరాయం కలిగినట్టి సేవతోసహా ఆ కాలావధిపాటు నిరంతరాయమైన సేవలో ఉన్నచో అతడు ఆ కాలావధిపాటు నిరంతర సేవలో ఉన్నట్లు చెప్పబడును – అట్టి నిరంతరాయమైన లేక అంతరాయముతో కూడిన అట్టి సేవను ఈ చట్ట ప్రారంభమునకు పూర్వం చేసియున్నను సరే ఆ తరువాత చేసినను సరే.

(2) (కాలిక స్థాపనలో నియుక్తుడైన ఉద్యోగి కానట్టి) ఎవరేని ఉద్యోగి ఏదేని ఒక సంవత్సరం లేక ఆరు మాసముల కాలావధిపాటు ఖండం (1) యొక్క భావ పరిధిలో నిరంతర సేవలోలేనియెడల–

(ఎ) ఆ ఉద్యోగి, ఏ తేదీనిబట్టి లెక్కకట్టవలసియున్నదో ఆ తేదీకి పూర్వము పండ్రెండు క్యాలెండరు మాసముల కాలావధిలో నియామకుని క్రింద–

(i) ఒక గనిలో నేలక్రింద పనిచేయుటకు లేక వారంలో ఆరు దినముల కంటె తక్కువ కాలం పనిచేయు స్థాపనలో నియుక్తుడైన ఉద్యోగి విషయంలో, ఒక వంద తొంబది దినముల కంటె తక్కువ కాని కాలంపాటు;

(ii) ఏదేని ఇతర సందర్భంలో రెండువందల నలుబది దినముల కంటె తక్కువ కాని కాలంపాటు,

వాస్తవంగా పనిచేసినచో అతనని సదరు ఒక సంవత్సరం కాలంపాటు నిరంతర సేవలో ఉన్నట్లు భావించవలెను.

(బి) ఆ ఉద్యోగి ఏ తేదీనిబట్టి లెక్కకట్టవలసియున్నదో ఆ తేదీకి పూర్వము ఆరు క్యాలెండరు మాసముల కాలావధిలో నియామకుని క్రింద–

(i) ఒక గనిలో నేలక్రింద పనిచేయుటకు లేక వారంలో ఆరు దినముల కంటె తక్కువ కాలం పనిచేయు స్థాపనలో నియుక్తుడైన ఉద్యోగి విషయంలో తొంభై అయిదు దినముల కంటె తక్కువ కాని కాలంపాటు,

(ii) ఏదేని ఇతర సందర్భంలో, ఒక వంద ఇరువది దినముల కంటె తక్కువకాని కాలంపాటు,

వాస్తవంగా పనిచేసినచో అతడు సదరు ఆరు మాసముల కాలంపాటు నిరంతర సేవలో ఉన్నట్లు భావించవలెను.

<u>విశదీకరణ</u>.– ఖండము (2) నిమిత్తం ఎవరేని ఉద్యోగి నియామకుని క్రింద వాస్తవంగా పనిచేసిన దినముల సంఖ్యలో ఈ క్రింది దినములు చేరియుండును:–

(i) అతడు ఏదేని కరారు క్రిందగాని, పారిశ్రామిక ఉద్యోగ (స్థాయీ ఉత్తరువుల) చట్టము, 1946 క్రింద చేసిన స్థాయీ ఉత్తరువుల ననుసరించి లేక 1946 లోని 20.
పారిశ్రామిక వివాదముల చట్టము, 1947 క్రింద లేక ఆ స్థాపనకు వర్తించు ఏదేని 1947 లోని 14.
ఇతర శాసనము క్రింద అనుమతించినట్లుగాని (పని బందు) ఉండిన దినములు;

(ii) అతడు క్రిందటి సంవత్సరం గడించిన పూర్తి వేతనపు సెలవులో ఉండిన దినములు;

(iii) అతడు తన ఉద్యోగ పర్యవసానంగాను ఉద్యోగానుక్రమంలోను సంభవించిన దుర్ఘటన వలన తాత్కాలిక అశక్తత కారణంగా గైరుహాజరు అయిన దినములు;

(iv) ఒక స్త్రీ విషయంలో, ఆమె ప్రసూతి సెలవులో ఉన్న దినములు.

అయితే అట్టి మొత్తం ప్రసూతి సెలవు కాలావధి పండ్రెండు వారములకు మించకూడదు.

(3) ఏదేని కాలిక స్థాపనలో నియుక్తుడైన ఎవరేని ఉద్యోగి, ఖండం (1) యొక్క భావపరిధిలో ఏదేని ఒక సంవత్సరం లేక ఆరు మాసముల కాలావధిపాటు నిరంతర సేవలో లేనియెడల, అట్టి కాలావధిలో ఆ స్థాపనలో పనిచేసిన దినముల సంఖ్యలో డెబ్బది అయిదు శాతమున కంటె తక్కువకాని దినములపాటు అతడు వాస్తవంగా పనిచేసినచో, అతడు అట్టి కాలావధిపాటు యజమానుని క్రింద నిరంతర సేవలో ఉన్నట్లు భావించవలెను.

నియంత్రణ ప్రాధికారి.

3. సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా ఎవరేని అధికారిని నియంత్రణ ప్రాధికారిగా నియమించవచ్చును; ఆ ప్రాధికారి ఈ చట్టమును అమలుపరచుటకు బాధ్యుడై ఉండును; వేరువేరు ప్రాంతాలకు వేరువేరు నియంత్రణ ప్రాధికారులను నియమించవచ్చును.

గ్రాట్యుటీ చెల్లింపు.

4. (1) ఒక ఉద్యోగి అయిదు సంవత్సరములకు తక్కువ కాకుండ నిరంతర సేవచేసియుండిన పిమ్మట—

(ఎ) అతనికి వయసు నిండిన మీదట, లేక

(బి) అతడు పదవీ విరమణ, లేక రాజీనామా చేసిన మీదట, లేక

(సి) దుర్ఘటన, లేక వ్యాధి వలన మరణించిన మీదట, లేక అశక్తుడైన మీదట,

అతని ఉద్యోగము సమాప్తము చేయబడినపుడు, అతనికి గ్రాట్యుటీ చెల్లించవలెను:

అయితే, మరణము, లేక అశక్తత వలన ఎవరేని ఉద్యోగిచేయు ఉద్యోగము సమాప్తము చేయబడినయెడల అయిదు సంవత్సరముల నిరంతర సేవ పూర్తిచేయనక్కర లేదు:

అంతేకాక, ఉద్యోగి మరణించిన సందర్భంలో, అతనికి చెల్లించదగు గ్రాట్యుటీ అతని నామనిర్దేశితునికి, లేక నామనిర్దేశమేదియు చేయబడనిచో, అతని వారసులకు చెల్లించవలెను; ఎవరేని అట్టి నామనిర్దేశితుడు లేక వారసుడు మైనరు అయినచో అట్టి మైనరు వాటాను నియంత్రణ ప్రాధికారివద్ద జమచేయవలెను; అతడు దానిని మైనరు మేలుకొరకు అట్టి మైనరు మేజరగు వరకు, విహితరీతిలో అట్టి బ్యాంకులో లేక ఇతర ఆర్థిక సంస్థలో పెట్టుబడిపెట్టవలెను.

<u>విశదీకరణ</u>.—ఈ పరిచ్ఛేదము నిమిత్తం అశక్తత అనగా, ఒక ఉద్యోగికి అశక్తత కలిగించినట్టి దుర్ఘటనకు, లేక వ్యాధికి పూర్వము ఆ ఉద్యోగి చేయగలిగియుండినట్టి పనిని చేయుటకు అతనిని అసమర్థుని చేయునట్టి అశక్తత అని అర్థము.

(2) సంబంధిత ఉద్యోగి కడపట తీసికొనిన వేతనపు రేటు ప్రాతిపదికపై ఆ ఉద్యోగికి, నియామకుడు పూర్తియైన ప్రతియొక సేవా సంవత్సరమునకు లేక ఆరు మాసములకు మించియుండు అందలి భాగమునకు పదునైదు దినముల వేతనము రేటు చొప్పున గ్రాట్యుటీ చెల్లించవలెను:

అయితే, మాత్రాసుపాత రేటుపొందు ఉద్యోగి విషయములో, అతని ఉద్యోగము సమాప్తమగుటకు అవ్యవహిత పూర్వము మూడు మాసముల కాలావధిలో అతడు పొందిన మొత్తము వేతనం యొక్క సగటుపై అతని దినసరి వేతనము లెక్కకట్ట వలెను. మరియు అందు నిమిత్తం, ఏదేని అదనపు కాలము పనికై చెల్లించిన వేతనమును లెక్కలోనికి తీసికొనరాదు.

అయితే ఇంకను, ఒక కాలిక స్థాపనలో నియుక్తుడై, సంవత్సరమంతటికి నియుక్తుడుకాని ఉద్యోగి విషయంలో నియామకుడు, ప్రతియొక కాలమునకు ఏడు దినముల వేతనం రేటుచొప్పున గ్రాట్యుటీ చెల్లించవలెను.

విశదీకరణ — మాసవారీ రేటుపొందు ఉద్యోగి విషయంలో అతడు కడపట పొందిన మాసవారీ వేతనపు రేటును ఇరువది ఆరుచే భాగించి భాగలబ్ధమును పదిహేనుతో హెచ్చించుట ద్వారా పదిహేను దినముల వేతనమును లెక్కకట్టవలెను.

(3) ఒక ఉద్యోగికి చెల్లించవలగు గ్రాట్యుటీ మొత్తము, యాబదివేల రూపాయలకు మించరాదు.

(4) ఒక ఉద్యోగికి అశక్తత కలిగిన పిమ్మట తగ్గింపు వేతనంపై నియుక్తుడైనపుడు, అతనికి చెల్లించవలగు గ్రాట్యుటీని లెక్కకట్టు నిమిత్తం, అశక్తత కలుగుటకు పూర్వము అతని వేతనమును, ఆ కాలావధిలో అతడు పొందిన వేతనముగా ఎంచవలెను, మరియు అశక్తత కలిగిన తరువాతి కాలావధికి అతడు పొందిన వేతనమును అట్లు తగ్గించబడిన వేతనముగా ఎంచవలెను.

(5) ఏదేని అధినిర్ణయము క్రిందగాని, నియామకునితో చేసికొనిన కరారు, లేక ఒప్పందము క్రిందగాని మెరుగైన నిబంధనలపై గ్రాట్యుటీని పొందుటకు ఎవరేని ఉద్యోగికిగల హక్కుకు ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు భంగము కలిగించదు.

(6) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమియున్నప్పటికిని,

(ఎ) ఎవరేని ఉద్యోగి చేసిన ఏదేని కార్యము, బుద్ధిపూర్వకమైన కార్య లోపము లేక నిర్లక్ష్యము వలన నియామకునికి చెందిన ఆస్తికి ఏదేని చెరుపు, లేక నష్టము కలిగినందున, లేక ఆ ఆస్తి నాశమైనందున ఆ ఉద్యోగి సేవలు సమాప్తము చేయబడినపుడు, ఆ ఉద్యోగికి ఇవ్వవలగు గ్రాట్యుటీ అట్లు కలిగిన చెరుపు లేక నష్టము మేరకు సమపహరణము చేయబడును.

(బి) ఎవరేని ఉద్యోగికి చెల్లించవలగు గ్రాట్యుటీ ఈ క్రింది పరిస్థితిలో పూర్తిగా గాని కొంత గాని సమపహరణము చేయవచ్చును:

(i) అట్టి ఉద్యోగి సేవలు, దొమ్మీ చేయునట్టి లేక శాంతిభంగకరమైనట్టి అతని నడవడి కారణముగ, లేక అతడు ఏదేని ఇతర హింసాత్మక కార్యము చేసినందున, సమాప్తము చేయబడినచో, లేక

(ii) అట్టి ఉద్యోగి సేవలు, నీతిబాహ్యతతో కూడిన అపరాధమగునట్టి ఏదేని కార్యము చేసినందున సమాప్తము చేయబడినచో; అయితే, అట్టి అపరాధమును అతడు అతని ఉద్యోగానుక్రమములో చేసినదైయుండవలెను.

(7) 2వ పరిచ్ఛేదపు ఖండం (ఈ)లో నిర్దేశించిన ఉద్యోగి యొక్క ఉద్యోగము ఉపపరిచ్ఛేదం (1) లోని ఖండం (ఏ) లేక ఖండం (బీ) లేక

ఖండము (సి)లో నిర్దిష్టపరచిన రీతిగా సమాప్తము చేయబడుటకు పూర్వం వెంటనే గాని ఎప్పుడైనను గాని అతడు--

(i) అట్లు అతని ఉద్యోగ సమాపనం గ్రాట్యుయిటీ చెల్లింపు (సవరణ) చట్టము, 1984 ప్రారంభమగుటకు పూర్వం జరిగినయెడల, మాసమునకు ఒక వేయి రూపాయలకు మించిన వేతనం పొందుచుండినప్పటికిని,

(ii) అట్లు అతని ఉద్యోగ సమాపనం ఆ చట్ట ప్రారంభమునకు తరువాత జరిగినయెడల, మాసమునకు ఒక వేయి ఆరువందల రూపాయలకు మించిన వేతనం పొందుచుండినప్పటికిని,

2వ పరిచ్ఛేదపు ఖండము (ఈ)కి గల విశదీకరణ యొక్క నిబంధనల ప్రకారం నిర్ధారణ చేసిన గ్రాట్యుయిటీ అతనికి చెల్లించదగియుండునని సందేహ నివారణకై ఇందుమూలముగా ప్రఖ్యానించడమైనది.

నిర్బంధ భీమా. 4-ఏ. (1) సముచిత ప్రభుత్వము ఈ విషయములో అధిసూచన చేయు తేదీ లగాయతు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన లేక రాజ్య ప్రభుత్వానికి చెందిన లేక వారి నియంత్రణ క్రిందనున్న నియామకుడుగాని, స్థాపనగాని కానట్టి ప్రతియొక నియామకుడు, ఉపపరిచ్ఛేదము (2) లోని నిబంధనలకు లోబడి, ఈ చట్టము క్రింద గ్రాట్యుయిటీ చెల్లించుటకు తనకుగల బాధ్యత కొరకు, భారత జీవిత భీమా
1956 లోని 36. కార్పొరేషను చట్టము, 1956 క్రింద ఏర్పాటైన భారత జీవిత భీమా కార్పొరేషను నుండి గాని విహితపరచిన ఎవరేని ఇతర భీమా కర్త నుండి గాని భీమా పొందవలెను:

అయితే, వేరువేరు స్థాపనలకు లేక వేరువేరు కోవలకు చెందిన స్థాపనలకు లేక వేరువేరు ప్రాంతాలకు వేరువేరు తేదీలను నియతం చేయవచ్చును.

(2) తన ఉద్యోగుల విషయంలో ఒక ఆమోదిత గ్రాట్యుయిటీ నిధిని ఇదివరకే ఏర్పాటు చేసియుండి అట్టి ఏర్పాటును కొనసాగించదలచిన ప్రతియొక నియామకుణ్ణి, మరియు అయిదు వందలు లేక అంతకెక్కువ మంది వ్యక్తులను నియోగించి విహిత రీతిలో ఒక ఆమోదిత గ్రాట్యుయిటీ నిధిని ఏర్పాటు చేయు ప్రతియొక నియామకుణ్ణి, సముచిత ప్రభుత్వము విహితపరచబడునట్టి షరతులకు లోబడి ఉపపరిచ్ఛేదము (1) యొక్క నిబంధనల నుండి మినహాయించవచ్చును.

(3) ఈ పరిచ్ఛేదపు నిబంధనలను ప్రభావవంతంగా అమలుపరచు నిమిత్తం, ప్రతియొక నియామకుడు తన స్థాపనను విహితపరచబడు గడువులోపల నియంత్రణ ప్రాధికారివద్ద విహితరీతిగా రిజిస్టరు చేయించవలెను; ఏ నియామకుణ్ణిగాని, అతడు ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన భీమా తీసికొనిననే తప్ప లేక ఉపపరిచ్ఛేదము (2)లో నిర్దేశించిన ఆమోదిత గ్రాట్యుయిటీ నిధిని ఏర్పాటు చేసిననే తప్ప, ఈ పరిచ్ఛేదపు నిబంధనల క్రింద రిజిస్టరు చేసికొనరాదు.

(4) సముచిత ప్రభుత్వము, ఈ పరిచ్ఛేదపు నిబంధనలను అమలుపరచుటకు, అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును. అట్టి నియమములలో ఆమోదిత గ్రాట్యుయిటీ నిధియొక్క ట్రస్టీమండలిని ఏర్పాటు చేయుటకొరకును, నియంత్రణ ప్రాధికారి ఎవరేని ఉద్యోగికి చెల్లింపదగిన గ్రాట్యుయిటీ మొత్తమును, భారత జీవిత భీమా కార్పొరేషను నుండి గాని ఉపపరిచ్ఛేదము (1) క్రింద ఎవరివద్ద భీమా తీసికొనబడినదో అట్టి ఎవరేని ఇతర భీమాకర్త నుండి గాని సందర్భానుసారంగా ఆమోదిత గ్రాట్యుయిటీ నిధియొక్క ట్రస్టీ మండలి నుండి గాని వసూలు చేయుట కొరకును నిబంధనలు చేయవచ్చును.

(5) ఎవరేని నియామకుడు, ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన భీమాకు ప్రీమియముగా గాని ఉపపరిచ్ఛేదము (2)లో నిర్దేశించిన ఆమోదిత గ్రాట్యుటీ నిధికి అభిదాయముగా గాని ఏదేని చెల్లింపు చేయనియెడల, అతడు (ఆలస్యంగా చేయు చెల్లింపుకై వడ్డీ ఏదేని ఉన్నచో అట్టి వడ్డీతో సహా) ఈ చట్టము క్రింద చెల్లించ వలసియున్న గ్రాట్యుటీ మొత్తమును వెంటనే నియంత్రణ ప్రాధికారికి చెల్లించుటకు బాధ్యుడైయుండును.

(6) ఉపపరిచ్ఛేదము (5) యొక్క నిబంధనలను ఉల్లంఘించు వారెవరైనను, పదివేల రూపాయలదాక ఉండగల జుర్మానాతో, మరియు అపరాధం కొనసాగుచుండు సందర్భంలో, అట్లు కొనసాగుచుండు ప్రతి దినమునకు ఒకవేయి రూపాయలదాక ఉండగల అదనపు జుర్మానాతో శిక్షింపదగియుండురు.

<u>విశదీకరణ</u>:- ఈ పరిచ్ఛేదములో "ఆమోదిత గ్రాట్యుటీ నిధి" అను పదబంధము ఆదాయ పన్ను చట్టము, 1961 లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (5)లో [illegible] అర్థము కలదో ఆ అర్థమునే కలిగియుండును. 1961 లోని 43.

మినహాయించు అధికారము.

5. (1) ఈ చట్టము వర్తించు ఏదేని స్థాపన, ఫ్యాక్టరీ, గని, తైల క్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ, లేక దుకాణములోని ఉద్యోగులు ఈ చట్టము క్రింద ఒసగిన వాటి కంటె తక్కువ అనుకూలమైనవి కానట్టి గ్రాట్యుటీ లేక పింఛను సౌకర్యములను పొందుచున్నారని సముచిత ప్రభుత్వము అభిప్రాయపడినచో, ఆ ప్రభుత్వము అధిసూచన ద్వారా, ఆ అధిసూచనలో నిర్దిష్టపరచునట్టి షరతులకు లోబడి అట్టి స్థాపనను, ఫ్యాక్టరీని, గనిని, తైలక్షేత్రమును, తోటను, ఓడరేవును, రైల్వే కంపెనీని, లేక దుకాణమును ఈ చట్టపు నిబంధనల అమలు నుండి మినహాయించ వచ్చును.

(2) ఈ చట్టము వర్తించు ఏదేని స్థాపన, ఫ్యాక్టరీ, గని, తైలక్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ లేక దుకాణములో నియమించబడిన ఎవరేని ఉద్యోగి లేక ఏదేని కోవకు చెందిన ఉద్యోగులు, ఈ చట్టము క్రింద ఒసగిన వాటికంటె తక్కువ అనుకూలమైనవి కానట్టి గ్రాట్యుటీ లేక పింఛను సౌకర్యములను పొందుచున్నారని, సముచిత ప్రభుత్వము అభిప్రాయపడినచో, ఈ చట్టపు నిబంధనల అమలునుండి సముచిత ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఆ అధిసూచనలో నిర్దిష్టపరచునట్టి షరతులకు లోబడి, అట్టి ఎవరేని ఉద్యోగిని లేక అట్టి ఏదేని కోవకుచెందిన ఉద్యోగులను ఈ చట్టపు నిబంధనల అమలు నుండి మినహాయించవచ్చును;

(3) ఉపపరిచ్ఛేదము (1) లేక ఉపపరిచ్ఛేదము (2) క్రింద జారీచేయబడిన అధిసూచనను, ఈ చట్ట ప్రారంభపు తేదీకి పూర్వము కానటువంటి గతకాలిక తేదీ ప్రభావంతో జారీచేయవచ్చును. కాని అట్టి అధిసూచన ఏదియు ఎవరేని వ్యక్తి హితములకు భంగం కలిగించునట్లు జారీచేయరాదు.

నామనిర్దేశము.

6. (1) ఒక సంవత్సరము సేవ పూర్తిచేసిన ప్రతియొక ఉద్యోగి, 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) లోని వినాయింపు నిమిత్తం విహితపరచబడునట్టి కాలములోను అట్టి ప్రరూపములోను మరియు అట్టి రీతిగాను నామనిర్దేశము చేయవలెను.

(2) ఉద్యోగి, తనకు ఈ చట్టము క్రింద చెల్లించదగు గ్రాట్యుటీ మొత్తమును తన నామనిర్దేశముతో, ఒకరికంటె ఎక్కువమంది నామనిర్దేశితుల మధ్య పంపిణీ చేయవచ్చును.

(3) నామనిర్దేశము చేయునప్పుడు ఉద్యోగికి కుటుంబము ఉన్నచో, ఆ నామనిర్దేశము అతని కుటుంబ సభ్యులలో ఒకరి పేరగాని అంతకెక్కువ మంది పేరగాని చేయవలెను; మరియు అతని కుటుంబ సభ్యుడు కానట్టి ఎవరేని వ్యక్తిపేర అట్టి ఉద్యోగి చేసిన ఏదేని నామనిర్దేశము చెల్లనిదగును.

(4) నామనిర్దేశము చేయునపుడు ఉద్యోగికి కుటుంబము లేనిచో, ఆ నామ నిర్దేశము ఏ వ్యక్తి, లేక వ్యక్తుల పేరనైనను చేయవచ్చును; కాని, ఆ తరువాత ఆ ఉద్యోగి ఒక కుటుంబము కలవాడగుచో, అట్టి నామనిర్దేశము తక్షణము శాసన మాన్యత లేనిదగును. మరియు ఆ ఉద్యోగి తన కుటుంబ సభ్యులలో నుండి ఒకరి పేరగాని అంతకెక్కువమంది పేరగాని ఒక క్రొత్త నామనిర్దేశమును, విహితపరచబడు గడువులోపల చేయవలెను.

(5) ఉపపరిచ్ఛేదములు (3) మరియు (4) యొక్క నిబంధనలకు లోబడి, ఏదేని నామనిర్దేశమును మార్చుటకు తనకు ఉద్దేశము కలదని ఉద్యోగి విహితపరచ బడునట్టి ప్రరూపములోను అట్టి రీతిగాను అతని నియామకునికి నోటీసు ఇచ్చిన పిమ్మట ఆ నామనిర్దేశమును అట్టి ఉద్యోగి ఎప్పుడైనను మార్చవచ్చును.

(6) ఒక నామనిర్దేశితుడు ఉద్యోగి కంటె ముందు మరణించినచో, ఆ నామ నిర్దేశితుని హితము ఉద్యోగికి తిరిగి సంక్రమించును మరియు ఆ ఉద్యోగి అట్టి హితమును గూర్చి ఒక క్రొత్త నామనిర్దేశమును విహిత ప్రరూపములో చేయవలెను.

(7) సందర్భానుసారముగ, ప్రతియొక నామనిర్దేశమును క్రొత్త నామ నిర్దేశమును లేక నామనిర్దేశము యొక్క మార్పును ఉద్యోగి తన నియామకునికి పంపవలెను, మరియు ఆ నియామకుడు దానిని తన సురక్షితాభిరక్షలో ఉంచవలెను.

గ్రాట్యుటీ మొత్తమును నిర్ధారణ చేయుట.

7. (1) ఈ చట్టము క్రింద గ్రాట్యుటీ చెల్లింపుకు అర్హుడైన వ్యక్తి, లేక అతని తరఫున వ్యవహరించుటకు వ్రాతమూలకముగ ప్రాధికారము పొందిన ఎవరేని వ్యక్తి, అట్టి గ్రాట్యుటీ చెల్లింపు కొరకు ఒక వ్రాతమూలకమైన దరఖాస్తును నియామకునికి, విహితపరచబడునట్టి గడువు లోపలను అట్టి ప్రరూపములోను పంప వలెను.

(2) గ్రాట్యుటీ చెల్లింపబడదగినదైన వెంటనే నియామకుడు, ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన దరఖాస్తు చేయబడినను లేకున్నను, గ్రాట్యుటీ మొత్తమును నిర్ధారణచేసి, ఆ గ్రాట్యుటీ ఎవరికి చెల్లింపదగియున్నదో ఆ వ్యక్తికి, మరియు నియంత్రణ ప్రాధికారికి కూడ, అట్లు నిర్ధారణ చేసిన గ్రాట్యుటీ మొత్తమును నిర్దిష్ట పరచుచు వ్రాతమూలకముగ తెలియజేయవలెను.

(3) నియామకుడు, గ్రాట్యుటీ మొత్తమును ఏ వ్యక్తికి చెల్లించవలసి యున్నదో ఆ వ్యక్తికి, అది చెల్లింపబడదగినదైన తేదీనుండి ముప్పది దినముల లోపల చెల్లించుటకు ఏర్పాటు చేయవలెను.

(3-ఏ) ఉపపరిచ్ఛేదము (3) క్రింద చెల్లించవలసిన గ్రాట్యుటీ మొత్తమును, ఉప-పరిచ్ఛేదము (3)లో నిర్దేశించిన కాలావధిలోపల నియామకుడు చెల్లించనిచో ఆ గ్రాట్యుటీ ఏ తేదీన చెల్లించవలసినదగునో ఆ తేదీనుండి అది చెల్లించిన తేదీవరకు, కేంద్ర ప్రభుత్వము, దీర్ఘకాలిక డిపాజిట్లు తిరిగి చెల్లించుటకు ఆయా సమయము లందు అధిసూచించిన రేటుకు మించకుండ ఆ ప్రభుత్వము అధిసూచన ద్వారా నిర్దిష్ట పరచిన రేటు చొప్పున సామాన్య వడ్డీని, నియామకుడు చెల్లించవలెను:

అయితే, చెల్లింపులోని ఆలస్యం ఉద్యోగి తప్పిదము వలన జరిగినచో మరియు నియామకుడు ఆ కారణముపై ఆలస్యంగా చెల్లించుటకు నియంత్రణ ప్రాధికారి నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందినచో, అట్టి వడ్డీ ఏదియు చెల్లించదగియుండదు.

(4) (ఎ) ఈ చట్టము క్రింద ఒక ఉద్యోగికి చెల్లించదగు గ్రాట్యుటీ మొత్తమును గూర్చి లేక గ్రాట్యుటీ చెల్లింపు కొరకు ఒక ఉద్యోగి యొక్క, లేక ఒక ఉద్యోగి విషయమున ఏదేని క్లెయిమును గ్రహించుటను గూర్చి లేక గ్రాట్యుటీ పొందుటకు హక్కుగల వ్యక్తిని గూర్చి ఏదేని వివాదము ఉన్నచో, నియామకుడు తనచే గ్రాట్యుటీ రూపమున చెల్లింపబడదగినదిగా అతడు ఒప్పుకొనునంత మొత్తమును నియంత్రణ ప్రాధికారివద్ద డిపాజిటు చేయవలెను.

(బి) ఖండము (ఎ)లో నిర్దిష్టపరచిన ఏదేని విషయమును లేక విషయము లను గూర్చి వివాదమున్నచో, నియామకుడు లేక ఉద్యోగి లేక వివాదము లేవనెత్తిన ఎవరేని ఇతర వ్యక్తి వివాదముపై నిర్ణయము నొసగుటకై నియంత్రణ ప్రాధికారికి దరఖాస్తు చేయవచ్చును.

(సి) తగు పరిశీలన జరిపిన పిమ్మటను, తమ విన్నపముల నాకర్ణించుటకు వివాద పక్షకారులకు యుక్తమైన అవకాశము నొసగిన పిమ్మటను, నియంత్రణ ప్రాధికారి, విషయమును లేక విషయములను నిర్ధారణ చేయవలెను. అట్లు పరిశీలన జరిపిన పర్యవసానంగా, ఏదేని మొత్తము ఉద్యోగికి చెల్లించవలెనని కనుగొనబడినచో నియంత్రణ ప్రాధికారి, సందర్భానుసారముగ అట్టి మొత్తమును లేక అదివరకే నియామకుడు డిపాజిటు చేసిన మొత్తమును తగ్గించి అట్టి మొత్తమును చెల్లించుటకు, నియామకుడిని ఆదేశించవలెను.

(డి) నియంత్రణ ప్రాధికారి, నియామకుడు ఏదేని అదనపు మొత్తమును డిపాజిటు చేసినచో అట్టి అదనపు మొత్తముతో సహా డిపాజిటు చేయబడిన మొత్తమును దానికి హక్కుగల వ్యక్తికి చెల్లించవలెను.

(ఇ) ఖండము (ఎ) క్రింద ఏదేని మొత్తము డిపాజిటు అయిన పిమ్మట వీలైనంత త్వరగా నియంత్రణ ప్రాధికారి, ఆ డిపాజిటు మొత్తమును ఈ క్రింది వారికి చెల్లించవలెను:-

(i) దరఖాస్తుదారు ఉద్యోగి అయినయెడల ఆ దరఖాస్తుదారుకు, లేక

(ii) దరఖాస్తుదారు ఉద్యోగికానియెడల, గ్రాట్యుటీ మొత్తమును పొందుటకు దరఖాస్తుదారుకుగల హక్కును గూర్చి వివాదమేదియు లేదని నియంత్రణ ప్రాధికారి తృప్తిచెందినచో ఉద్యోగియొక్క నామనిర్దేశితునికి లేక సందర్భానుసారముగ నామనిర్దేశితుని సంరక్షకునికి లేక ఉద్యోగి యొక్క వారసునికి.

(5) ఉప-పరిచ్ఛేదము (4) క్రింద పరిశీలన జరుపు నిమిత్తం నియంత్రణ ప్రాధికారి, ఈ క్రింద తెలిపిన ఈ విషయములను గూర్చి సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద ఒక దావాను విచారణ చేయుటలో ఒక న్యాయస్థానమునందు నిహితమై యున్న అధికారములనే కలిగియుండును; ఆ విషయము లేవనగా:- 1908 లోని 5.

(ఎ) ఏ వ్యక్తినైనను తప్పనిసరిగ హాజరగునట్లు చేయుట, లేక అతనిని ప్రమాణం చేయించి పరీక్షించుట;

(బి) దస్తావేజులను ప్రకటించవలెనని వాటిని దాఖలు చేయవలెనని కోరుట;

(సి) అఫిడవిట్‌లపై సాక్ష్యము తీసికొనుట;

(డి) సాక్షులను పరీక్షించుటకు కమీషన్లను పంపుట.

(6) ఈ పరిచ్ఛేదము క్రింద ఏదేని పరిశీలనను భారత శిక్షాస్మృతి యొక్క 193వ మరియు 228వ పరిచ్ఛేదముల యొక్క భావపరిధిలో మరియు 196వ పరిచ్ఛేదము నిమిత్తం ఒక న్యాయిక చర్యగా భావించవలెను.

1860 లోని 45.

(7) ఉపపరిచ్ఛేదము (4) క్రింది ఉత్తరువు వలన వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, ఆ ఉత్తరువు అందిన తేదీనుండి అరువది దినముల లోపల సముచిత ప్రభుత్వము నకు, లేక ఈ విషయంలో సముచిత ప్రభుత్వము నిర్దిష్టపరచిన ఇతర ప్రాధికారికి అపీలు చేయవచ్చును:

అయితే, అపీలుదారు చాలినంత కారణము వలన సదరు అరువది దినముల కాలావధి లోపల అపీలు చేయజాలకపోయినాడని సందర్భానుసారముగ సముచిత ప్రభుత్వము లేక అపీలు ప్రాధికారి తృప్తిచెందినచో ఆ ప్రభుత్వము లేక ప్రాధికారి సదరు కాలావధిని మరో అరువది దినములపాటు పొడిగించవచ్చును.

అంతేగాక, నియామకుడు పెట్టుకొను ఏ అపీలునుగాని, అపీలుదారు ఉపపరిచ్ఛేదము (4) క్రింద డిపాజిటు చేయవలసిన గ్రాట్యుటీ మొత్తమునకు సమానమైన మొత్తమును తనవద్ద డిపాజిటు చేసినాడని అపీలు ప్రాధికారి ఇచ్చిన ధ్రువపత్రమును అపీలు చేయునపుడు దాఖలు చేసిననే తప్ప లేక అట్టి మొత్తమును అపీలు చేయునపుడు అపీలు ప్రాధికారివద్ద డిపాజిటు చేసిననే తప్ప, స్వీకరించరాదు.

(8) సముచిత ప్రభుత్వము, లేక సందర్భానుసారముగ అపీలు ప్రాధికారి అపీలు పక్షకారులకు ఆకర్ణింపబడుటకు యుక్తమైన అవకాశము నొసగి నియంత్రణ ప్రాధికారి యొక్క నిర్ణయమును ధ్రువపరచవచ్చును, మార్చవచ్చును లేక విపర్యయ పరచవచ్చును.

ఇన్‌స్పెక్టర్లు.

7–ఏ. (1) సముచిత ప్రభుత్వము అధిసూచన ద్వారా, ఈ చట్ట ప్రయోజనముల కొరకై తాను సబబని భావించునంతమంది ఇన్‌స్పెక్టర్లను నియమించ వచ్చును.

(2) అట్లు నియమించిన ఇన్‌స్పెక్టరు యొక్క ప్రాధికారం విస్తరించు ప్రాంతమును సముచిత ప్రభుత్వము సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా నిశ్చయించవచ్చును. మరియు ఒకే ప్రాంతానికి ఇద్దరు లేక అంతకెక్కువమంది ఇన్‌స్పెక్టర్లను నియమించినయెడల ఈ చట్టము క్రింద వారు నిర్వహించవలసిన పనిని పంపిణీ చేయుటకు లేక కేటాయించుటకు కూడ అట్టి ఉత్తరువు ద్వారా నిబంధన చేయవచ్చును.

1860 లోని 45.

(3) ప్రతియొక ఇన్‌స్పెక్టరును భారత శిక్షాస్మృతిలోని 21వ పరిచ్ఛేదపు భావపరిధిలో పబ్లికు సేవకుడైనట్లు భావించవలెను.

ఇన్‌స్పెక్టర్ల అధికారములు.

7–బి. (1) సముచిత ప్రభుత్వము ఈ విషయంలో చేసిన ఏవేని నియమము లకు లోబడి, ఇన్‌స్పెక్టరు, ఈ చట్టములోని ఏవేని నిబంధనలు గాని వాటి క్రింద ఏదేని మినహాయింపు ఇచ్చినచో, అట్టి మినహాయింపు షరతులుగాని పాటింపబడినవా అనునది

తెలిసికొను నిమిత్తం ఈ క్రింది అధికారాలన్నింటిని గాని వాటిలో దేనినైనను గాని వినియోగించవచ్చును, అవేవనగా:-

(ఎ) తాను ఆవశ్యకమని భావించు సమాచారమును అందజేయవలసినదిగా నియామకుణ్ణి కోరవచ్చును;

(బి) ఈ చట్టము క్రింద గాని ఈ చట్టము క్రింద చేసిన నియమముల క్రింద గాని ఉంచవలసిన లేక ప్రదర్శించవలసిన లేక ఎవరేని వ్యక్తి, ఉద్యోగానికి సంబంధించిగాని ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపుకు సంబంధించిగాని అన్యథా ఉంచబడెడి లేక ప్రదర్శింపబడెడి ఏదేని రిజిస్టరును, రికార్డును లేక నోటీసును లేక ఇతర దస్తావేజును పరీక్షించు నిమిత్తం, ఈ చట్టము వర్తించు ఏదేని ఫ్యాక్టరీ, గని, తైల క్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ, దుకాణము లేక ఇతర స్థాపన యొక్క ఏదేని ఆవరణలో లేక అందలి ఏదేని స్థలంలో ప్రభుత్వ సేవలోగాని స్థానిక లేక పబ్లిక్కు ప్రాధికార సంస్థ సేవలోగాని ఉన్న వ్యక్తులైయుండి తాను సబబని తలచు వారు (ఎవరేని ఉన్నచో) ఆ సహాయకులతో సబబైన అన్నివేళలందు ప్రవేశించి తనిఖీ చేయవచ్చును. మరియు దానిని తనిఖీకొరకు దాఖలు చేయవలసినదిగా కోరవచ్చును;

(సి) నియామకుణ్ణి లేక అట్టి ఆవరణలో లేక స్థలంలో ఉన్నట్టియు అందు నియుక్తుడైన ఉద్యోగి అని విశ్వసించుటకు తనకు యుక్తమైన కారణమున్నట్టియు ఎవరేని వ్యక్తిని, పైన తెలిపిన ఏ ప్రయోజనమునకైనను సంబద్ధమైన ఏదేని విషయమును గురించి పరీక్షించవచ్చును;

(డి) తాను సంబద్ధమైనదని భావించునట్టి ఏదేని రిజిస్టరు, రికార్డు, నోటీసు లేక ఇతర దస్తావేజు యొక్క నకళ్లు తయారు చేసికొనవచ్చును లేక వాటి నుండి ఉదాహృతులను తీసికొనవచ్చును; ఎవరేని నియామకుడు ఈ చట్టం క్రింద ఏదేని అపరాధం చేసినాడని విశ్వసించుటకు తనకు కారణమున్నయెడల ఆ అపరాధం విషయంలో సంబద్ధమైనదని తాను భావించునట్టి రిజిస్టరును, రికార్డును, నోటీసును లేక ఇతర దస్తావేజును తాను సబబని తలచునట్టి సహాయంతో సోదాచేసి అభిగ్రహించవచ్చును;

(ఇ) విహితపరచబడునట్టి ఇతర అధికారాలను వినియోగించవచ్చును;

(2) ఏదేని రిజిస్టరును, రికార్డును, నోటీసును లేక ఇతర దస్తావేజును దాఖలు చేయవలసినదిగా లేక ఏదేని సమాచారమును అందజేయవలసినదిగా ఇన్‌స్పెక్టరుచే ఉపపరిచ్ఛేదము (1) క్రింద కోరబడిన ఏ వ్యక్తియైనను భారత శిక్షాస్మృతిలోని 175వ మరియు 176వ పరిచ్ఛేదముల భావపరిధిలో అట్లు చేయుటకు శాసనరీత్యా బద్ధుడైయున్నట్లు భావించవలెను. 1860 లోని

(3) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 యొక్క నిబంధనలు ఆ స్మృతి లోని 94వ పరిచ్ఛేదము క్రింద జారీయైన వారంటు ప్రాధికారం క్రింద చేయబడు ఏదేని సోదా లేక అభిగ్రహణకు వర్తించునట్లుగనే వీలైనంతమేరకు, ఈ పరిచ్ఛేదము క్రింది ఏ సోదాకైనను, అభిగ్రహణకైనను వర్తించును. 1974 లోని

8. నియామకుడు, ఈ చట్టము క్రింద చెల్లించదగు గ్రాట్యుటీ మొత్తమును దానికి హక్కుగల వ్యక్తికి విహిత కాలావధిలో చెల్లించనిచో, వ్యధితుడైన వ్యక్తి తద్విషయంలో నియంత్రణ ప్రాధికారికి దరఖాస్తు పెట్టుకొనిన మీదట అట్టి మొత్తము కొరకు ఆ ప్రాధికారి, కలెక్టరుకు ఒక ధ్రువపత్రమును జారీచేయవలెను. ఆ కలెక్టరు విహిత కాలావధి ముగిసిన తేదీనుండి కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా

గ్రాట్యుటీని వసూలు చేయుట.

నిర్దిష్టపరమునట్టి రేటు చొప్పున వడ్డీతో సహా ఆ మొత్తమును భూమిశిస్తు బకాయివలె వసూలుచేసి దానిని, దానికి హక్కుగల వ్యక్తికి చెల్లించవలెను:

అయితే, నియంత్రణ ప్రాధికారి, ఈ పరిచ్ఛేదము క్రింద ధ్రువపత్రమును జారీచేయుటకు ముందు, నియామకుడికి అట్టి ధ్రువపత్రమును ఎందుకు జారీచేయ రాదో కారణము చూపుటకు యుక్తమైన అవకాశము నొసగవలెను:

అంతేకాక, ఈ పరిచ్ఛేదము క్రింద చెల్లించవలసిన వడ్డీ మొత్తము ఎట్టి పరిస్థితిలోను, ఈ చట్టము క్రింద చెల్లించవలసిన గ్రాట్యుటీ మొత్తమునకు మించరాదు.

శాస్తులు. 9. (1) ఏ వ్యక్తియైనను అతడు ఈ చట్టము క్రింద తాను చేయవలసిన ఏదేని చెల్లింపు చేయకుండ తప్పించుకొను నిమిత్తం, లేక అట్టి చెల్లింపు చేయకుండ తప్పించుకొనుటకు ఇతర వ్యక్తికి వీలుకల్పించు నిమిత్తం తెలిసియుండియు అబద్ధము చెప్పినచో, లేక తప్పుడుగా తెలియజేసినచో అతడు, ఆరుమాసముల దాక ఉండగల కాలావధికి కారావాసముతో లేక పదివేల రూపాయలదాక ఉండగల జుర్మానాతో లేక ఈ రెండింటితో శిక్షింపదగియుండును.

(2) ఈ చట్టం యొక్క ఏవేని నిబంధనలను, లేక వాటి క్రింద చేయబడిన ఏదేని నియమమును, లేక ఉత్తరువును ఉల్లంఘించు, లేక వాటిని పాటించుటలో వ్యతిక్రమము జరుపు నియామకుడు మూడు మాసములకు తక్కువ కాకుండ కాని ఒక సంవత్సరము దాక ఉండగల కాలావధికి కారావాసముతో, లేక పదివేల రూపాయలకు తక్కువ కాకుండ ఇరవైవేల రూపాయల దాక ఉండగల జుర్మానాతో లేక ఈ రెండింటితో శిక్షింపబడును:

అయితే, ఆ అపరాధము ఈ చట్టము క్రింద ఏదేని గ్రాట్యుటీ చెల్లింప కుండుటకు సంబంధించినదైనయెడల, తక్కువ కాలపు కారావాసము లేక జుర్మానా విధింపుతో న్యాయోద్దేశము నెరవేరునని ఆ అపరాధమును విచారణ జరుపుచున్న న్యాయ స్థానము, వ్రాసియుంచవలసిన కారణములనుబట్టి అభిప్రాయపడిననే తప్ప, నియామకుడు ఆరుమాసములకు తక్కువ కాకుండ రెండు సంవత్సరముల దాక ఉండగల కాలావధికి కారావాసముతో శిక్షింపబడును.

కొన్ని సందర్భములలో నియామకుడిని బాధ్యత నుండి మినహాయించుట. 10. నియామకుడిపై ఈ చట్టము క్రింద శిక్షార్హమైన అపరాధము ఆరోపించ బడినయెడల, అతడు, తగురీతిగా ఫిర్యాదు చేసిన అట్లు చేయుటకు గల తన ఉద్దేశమును గూర్చి మూడు పూర్తి దినములకు తక్కువ కాకుండ ఫిర్యాదికి నోటీసు ఇచ్చిన మీదట, వాస్తవ అపరాధియని అతడు ఆరోపించునట్టి ఎవరేని ఇతర వ్యక్తిని, ఆ ఆరోపణ యొక్క ఆకర్ణన కొరకు నియతము చేసిన సమయమున న్యాయస్థాన సమక్షమునకు రప్పించుటకు హక్కు కలిగియుండును; మరియు అపరాధము చేయబడి నట్లు రుజువైన పిమ్మట, నియామకుడు—

(ఎ) అతడు ఈ చట్టమును అమలుపరచుటకు తగు తత్పరత వహించినాడని, మరియు

(బి) ప్రసక్తిలోనున్న అపరాధమును, అతనికి తెలియకుండ, అతని సమ్మతి, లేక మౌనాంగీకారము లేకుండ సదరు ఇతర వ్యక్తి చేసినాడని,

న్యాయస్థానము తృప్తిచెందునట్లు రుజువుపరచినచో, ఆ ఇతర వ్యక్తి ఆ అపరాధమునకు నేరస్థాపన చేయబడి, అతడే నియామకుడు అయియుండిన ఎట్లో అట్లు అటువంటి శిక్షకే పాత్రుడు అగును, మరియు నియామకుణ్ణి అట్టి అపరాధమును గూర్చి ఈ చట్టము క్రింద గల ఏదేని బాధ్యత నుండి ఉన్మోచన చేయవలెను:

అయితే, పైన తెల్పినట్లు రుజువుపరచుటలో నియామకుణ్ణి ప్రమాణం చేయించి పరీక్షించవచ్చును. మరియు అతని సాక్ష్యము మరియు అతడు తనను సమర్థించుకొనుటకై ప్రవేశపెట్టిన ఎవరేని సాక్షియొక్క సాక్ష్యము, అతడు ఎవరిని వాస్తవమైన అపరాధిగా ఆరోపించినాడో ఆ వ్యక్తి తరఫున మరియు ప్రాసిక్యూటరుచే అడ్డుపరీక్ష చేయుబడుటకు లోనైయుండును:

అంతేకాక, వాస్తవమైన అపరాధియని నియామకుడు ఆరోపించిన వ్యక్తి, ఆ ఆరోపణయొక్క ఆకర్షణకై నియతము చేసిన సమయమున న్యాయస్థాన సమక్షమునకు తేబడజాలనిచో న్యాయస్థానము; ఆ ఆకర్షణను మూడు మాసములకు మించని కాలావధికి అయా సమయములందు వాయిదా వేయవచ్చును మరియు వాస్తవమైన అపరాధియని ఆరోపించబడిన వ్యక్తి సదరు కాలావధి అంతమున కూడ న్యాయస్థానము సమక్షమునకు తేబడజాలనిచో, న్యాయస్థానము నియామకునిపైగల ఆరోపణను ఆకర్షించుటకు ఉపక్రమించవలెను మరియు అపరాధము రుజువైనచో ఆ నియామకునిపై దోషస్థాపన చేయవలెను.

అపరాధముల సంజ్ఞానము.

11. (1) ఏ న్యాయస్థానము గాని, ఈ చట్టము క్రింద శిక్షార్హమైన ఏదేని అపరాధము యొక్క సంజ్ఞానము, సముచిత ప్రభుత్వముచే లేక సముచిత ప్రభుత్వ ప్రాధికారము క్రింద చేయబడిన ఫిర్యాదుపై తప్ప, చేయరాదు:

అయితే, గ్రాట్యుటీ మొత్తమును, విహిత కాలావధి ముగిసినప్పటి నుండి ఆరు మాసములలో చెల్లించనియెడల, లేక వసూలు చేయబడనియెడల, సముచిత ప్రభుత్వము నియామకునిపై ఫిర్యాదు చేయుటకు నియంత్రణ ప్రాధికారికి ప్రాధికార మొసగవలెను; అటుపై నియంత్రణ ప్రాధికారి, ఆ ప్రాధికారమొసగిన తేదీ నుండి పదునైదు దినములలో, ఆ అపరాధమును విచారణ జరుపుటకు అధికారితగల మేజిస్ట్రేటుకు ఫిర్యాదు చేయవలెను.

(2) ఒక ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటు కంటె, లేక మొదటి తరగతి మేజిస్ట్రేటు కంటె తక్కువ స్థాయి న్యాయస్థానమేదియు, ఈ చట్టము క్రింద శిక్షార్హమైన ఏ అపరాధమునుగాని విచారణ చేయరాదు.

సద్భావముతో తీసికొనిన చర్యకు రక్షణ.

12. ఈ చట్టము క్రిందగాని దాని క్రింద చేసిన ఏదేని నియమము లేక ఆదేశము క్రిందగాని సద్భావముతో చేసిన, లేక చేయుటకు ఉద్దేశించిన దేనిని గూర్చియైనను నియంత్రణ ప్రాధికారిపై గాని, ఎవరేని ఇతర వ్యక్తిపై గాని ఎట్టి దావా లేక ఇతర శాసనబద్ధ చర్య ఉండదు.

గ్రాట్యుటీకి రక్షణ.

13. ఈ చట్టము క్రింద చెల్లించదగు ఏ గ్రాట్యుటీ గాని మరియు 5వ పరిచ్ఛేదము క్రింద మినహాయించబడిన ఏదేని స్థాపన, ఫ్యాక్టరీ, గని, తైల క్షేత్రము, తోట, ఓడరేవు, రైల్వే కంపెనీ లేక దుకాణములో నియుక్తుడైన ఉద్యోగికి చెల్లించదగు ఏ గ్రాట్యుటీగాని ఏదేని సివిలు, రెవెన్యూ లేక క్రిమినలు న్యాయస్థానము యొక్క ఏదేని డిక్రీ, లేక ఉత్తరువును అమలు జరుపుటలో జప్తుకు లోనుకారాదు.

ఈ చట్టము ఇతర అనుశాసనములు మొదలైన వాటిని అధిగమించుట.

14. ఈ చట్టము కాకుండ ఏదేని ఇతర ~~అనుశాసనములో~~ లేక ఈ చట్టము కాకుండ ఏదేని ఇతర అనుశాసనమునుబట్టి ప్రభావము కలిగియున్న ఏదేని పత్రము, లేక ఒప్పందములో అందుకు అననుగుణముగ ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టపు నిబంధనలు లేక వాటి క్రింద చేసిన ఏదేని నియమము ప్రభావము కలిగియుండును.

నియమములు చేయుటకు అధికారము.

15. (1) సముచిత ప్రభుత్వము ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకు అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతి నియమమును, దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రంగా, పార్లమెంటు అధివేశనములో నున్నప్పుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనములోగాని రెండు లేక అంతకుమించి వరుసగా వచ్చు అధివేశనములలోగాని చేరియుండవచ్చును. మరియు పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో, లేక ఆ నియమము చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పుచేసిన రూపములో మాత్రమే అమలు కలిగియుండును లేక, సందర్భానుసారంగా, ప్రభావరహితమైయుండును. అయినప్పటికినీ, ఏదేని అట్టి మార్పుగాని రద్దుగాని అంతకుపూర్వము ఆ నియమము క్రింద చేసియుండిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించరాదు.

—*—